

50 ఏళ్ల ప్రస్థానం
ఏదీ నాటి వైభవం
6లో
● ఇదీ గిరిజన సహకార సంస్థ పరిస్థితి





పావురాలను ఎగురవేస్తున్న ఎస్పీ, ఏఎస్పీలు

పోలీస్ శాఖలో హోంగార్డుల పాత్ర కీలకం

● ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో హోంగార్డుల పాత్ర ఎంతో కీలకమని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్ మల్టీ ఫంక్షన్ హాల్ ఆవరణలో శనివారం హోంగార్డుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాధవరెడ్డి హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ . పోలీసులు నిర్వహించే అన్ని రకాల విధుల్లో హోంగార్డులు కూడా భాగస్వాములవుతూ క్రియాశీలకంగా మారారని తెలిపారు. వారందిస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. కేసుల దర్యాప్తు, నిందితులను పట్టుకోవడంలో ఎంతగానో సహకరిస్తుం టారని చెప్పారు. 63ఏళ్ల కిందట దేశ అంతర్గత భద్రతకు పోలీ సులకు సహాయపడేందుకు స్వచ్ఛందంగా ఏర్పడిన హోంగార్డులు శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. హోంగార్డుల సంక్షేమానికి రాష్ట్ర పోలీసుశాఖ కట్టుబడి ఉందన్నారు. అనంతరం హోంగార్డులకు చిహ్నమైన పావురాలను ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకటేశ్వరరావు, మనీషా వంగలరెడ్డి, డీఎస్పీ థామస్ రెడ్డి పాల్గొన్నారు.

మూలకు చేరినా.. పట్టించుకోరా?

● మరమ్మతులకు నోచని చెత్త తరలింపు వాహనాలు
● పార్వతీపురంలో పారిశుధ్య నిర్వహణకు ఇబ్బందులు
● స్వచ్ఛ సుందర కార్యక్రమానికి తూట్లు
● స్పందించని అధికారులు



మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చెత్తను తరలించే కంపాక్టర్ వాహనం ఇలా..



మరమ్మతుల కోసం షెడ్‌కు చేరిన ట్రాక్టర్

పార్వతీపురంటౌన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మున్సిపాల్టీలో పారిశుధ్య నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్వచ్ఛ సుందర కార్యక్రమానికి తూట్లు పడుతున్నాయి. పురపాలక సంఘానికి చెందిన 'పారిశుధ్య' వాహనాలు ఒక్కొక్కటిగా మూలకు చేరుతున్నాయి. వాటి మరమ్మతుల విషయంలో అధికారులు స్పందించడం లేదు. మున్సిపల్ ఇంజనీరింగ్, ప్రజారో గ్యశాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జిల్లా కేంద్రంగా ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నప్పటికీ పార్వతీపురం మున్సిపాల్టీ పరిస్థితేమీ మారలేదు. ప్రధానంగా 30వార్డుల్లో ప్రజలను పారిశుధ్యం, తాగునీటి సమస్యలు వేధిస్తూనే ఉన్నాయి. సుమారు ఐదేళ్ల కిందట స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పట్టణంలోని ప్రధాన రహదారి లోని చెత్తలను తరలించేందుకు రూ.40 లక్షలతో రెండు కంపాక్టర్లను మంజూరు చేశారు. అయితే అవి పనిచేసినంత కాలం ప్రజారోగ్య, ఇంజనీరింగ్ విభాగాల చక్కగా వినియోగించుకున్నారు. రెండు నెలల కిందట ఒక్కొక్కటిగా మరమ్మతులకు గురువడంతో వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో పట్టణంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. 30 వార్డులు, ప్రధాన రహదారిలోని రెస్టారెంట్లు, పలు దుకాణాలు, హోటళ్ల నుంచి రోజుకు సుమారు 15 టన్నుల వరకు చెత్త, వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. కాగా రెండు కంపాక్టర్‌లు మరమ్మతులకు గురి కావడంతో చెత్తల తరలించేందుకు పారిశుధ్య కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు.

● గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన రహదారి, బైపాస్ రోడ్డు, పార్కుల్లో నాటిన మొక్కలకు రోజు నీటిని అందించేందుకు ప్రత్యేకంగా ట్రాక్టర్‌ను

(మిగతా 8వ పేజీలో...)



ఉత్తిపోతలేనా?

● శంకుస్థాపనలతో సరి ● ప్రకటించి ఏళ్లు.. పట్టాలెక్కని ఎత్తిపోతల పథకాలు
● సాగునీటికి నోచుకోని వందలాది ఎకరాలు
● తీవ్ర నిరాశలో బొబ్బిలి ప్రాంత రైతులు



వర్షాధార ప్రాంతమైన బొబ్బిలి నియోజకవర్గంలో సాగునీటి వనరులు అంతంతమాత్రమే. ఉన్న వనరులను అందుకునే భాగ్యం రైతులకు కలగడం లేదు. తోటపల్లి కాలువ బొబ్బిలి నియోజకవర్గం మీదుగా చీపురుపల్లి ప్రాంతానికి వెళుతోంది. ఆ నీటిని రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా లోచర్ల, శివడవలస, రాముడువలస ప్రాంతాలకు అందిస్తామని ఎప్పుడో దశాబ్దం కిందట నేతలు ప్రకటించినప్పుడు రైతులంతా ఎంతో సంతోషించారు. 15 సంవత్సరాలు దాటినా ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో నేడు నిట్టూర్చుతున్నారు.

బొబ్బిలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో వర్షాధార భూములను సస్యశ్యామలం చేస్తామని, నిరంతరం పంటలను సాగు చేసుకునే అవకాశం కల్పిస్తామని దశాబ్దన్నర కిందట అప్పటి నేతలు ఎత్తిపోతల పథకాలను ప్రకటించారు. అతి త్వరలో సాగునీరు సరఫరా చేస్తామన్నారు. నిధుల విషయమై వాయిదా వేస్తూ వచ్చారు. ఇప్పటికీ కదలిక లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. 2010లో కాంగ్రెస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి తెర్లాం మండలం లోచర్ల గ్రామంలో ప్రజాపథం కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ సమయంలో రైతులంతా ఆయనను కలిసి తమ గ్రామానికి సమీపంలో తోటపల్లి కాలువ ఉన్నా సాగు నీరందడం లేదని మొరపెట్టుకున్నారు. దీనికి స్పందించిన ఆయన కాలువపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తామన్నారు. కానీ ఆ వైపులా ఎలాంటి చర్యలు లేవు. అప్పటి నుంచి స్థానిక రైతులు అధికారులు, నేతలకు విన్నవిస్తున్నా కదలిక లేక పోయింది. ఇంతవరకు ఎటువంటి నిధులు మంజూరు కాలేదు. 2019లో భూగర్భ గనుల శాఖమంత్రి హోదాలో సుజయ్‌కృష్ణరంగారావు లోచర్ల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. అయితే అంతలోనే ప్రభుత్వం మారిపోయింది. అధికారంలోకి వచ్చిన జగన్ తెర్లాం మండలం

(మిగతా 8వ పేజీలో...)



లోచర్ల ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి సుజయ్ (ఫైల్)

గాడిలో పడేనా?

● సచివాలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
● పర్యవేక్షణ అధికారుల నియామకం
● కొన్ని మండలాల్లో ఇంకా విధుల్లో చేరని వైనం





పార్వతీపురం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ సర్కారు కాలంలో ఏర్పాటు చేసిన సచివాలయాల వ్యవస్థపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వాటిని గాడిలో పెట్టేందుకు చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా సచివాలయాలకు ప్రత్యేక పర్యవేక్షణ అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటీ ఎంపీడీవో స్థాయి అధికారితో పాటు జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్‌తో సహా ఇద్దరు ఫంక్షనరీ సిబ్బందిని నియమించి సచివాలయాల పర్యవేక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టింది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 15 మండలాల్లో 312 గ్రామ సచివాలయాలున్నాయి. పార్వతీపురం, సాలూరు పురపాలక సంఘాలతో పాటు పాలకొండ నగర పంచాయతీ పరిధిలో 38 సచివాలయాలున్నాయి. పార్వతీ పురం, సాలూరుకు రెవెన్యూ ఆఫీసర్ క్యాడర్‌లో ఉన్న అధికారులతో పాటు సిబ్బందిని నియమించారు. పాలకొండలో సచివాలయాలకు ఇంకా పర్యవేక్షణ అధికారులను నియమించలేదు. మరోవైపు

(మిగతా 8వ పేజీలో...)

పక్కాగా ఎన్‌సీడీ సర్వే

● జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహన్‌రావు

పార్వతీపురం రూరల్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పక్కాగా ఎన్‌సీడీ సర్వే చేపట్టాలని జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు ఆదేశించారు. శనివారం చినబొండపల్లి, నర్సిపురంలో హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య సేవలపై ఆరా తీసి ఓపీ, హెల్త్ సర్వే రికార్డులు తనిఖీ చేశారు. అక్కడ నిర్వహించిన సంచార చికిత్సా శిబిరంలో దీర్ఘకాలిక రోగుల చికిత్సా వివరాలు, మందుల లభ్యతను పరిశీలించారు. వైద్య పరీక్షలకు వచ్చిన వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఆరోగ్య సమస్యను స్పష్టంగా నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్థుల ఆరోగ్యం ప్రతినెలా ఏ మేరకు మెరుగుపడుతుందో దృష్టిసారించాలన్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్ తదితర వ్యాధి లక్షణాలు గుర్తించి సకాలంలో రోగులకు వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూడీ డెమో గిరిబాబు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

కూలితే.. అంతే!

● శిథిలావస్థలో చిట్టగెడ్డ వంతెన
● బిక్కుబిక్కుమంటూ రాకపోకలు
● ఆందోళనలో 20 గిరిజన గ్రామాల ప్రజలు



చిట్టగెడ్డ వంతెన మధ్యలో ఏర్పడిన భారీ గొయ్యి

మక్కువ రూరల్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మార్కొండపుట్టి సమీపంలో ఉన్న చిట్టగెడ్డపై వంతెన శిథిలావస్థకు చేరింది. ఇది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో గిరిజనులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వంతెన మధ్య భాగంలో భారీ గొయ్యి ఏర్పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. 1996లో పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో సుమారు రూ.ఆరు లక్షలతో చిట్టగెడ్డపై కాజ్‌వే నిర్మించారు. అయితే కాలక్రమంలో ఈ వంతెనపై వాహన రాకపోకలు పెరిగాయి. నంద, షైశిల, తుండ గ్రామాల నుంచి పామాయిల్, మొక్కజొన్న తదితర వాణిజ్య పంటలను భారీ వాహనాల ద్వారా ఈ మార్గం గుండానే తరలిస్తుంటారు. మరోవైపు తుపాన్లు, భారీ వర్షాల కారణంగా వంతెన పరిస్థితి దయనీయంగా మారింది. ఈ రూటులో నిత్యం తిరిగే వాహనాలు కాజ్‌వేపై గొయ్యిలో ఇరుక్కుపోతున్నాయి. దీంతో మార్కొండపుట్టి, తుండ, నంద, మావుడి పంచాయతీలకు చెందిన 20 గిరిజన గ్రామాల ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ మార్గంలో మినీ వంతెన నిర్మించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు. దీనిపై పార్వతీపురం ఐటీడీఏ ఏఈ పీవీ సత్యనారాయణను వివరణ కోరగా.. 'చిట్ట గెడ్డపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.' అని తెలిపారు.

కురుపాంలో నిధుల దుర్వినియోగంపై విచారణ 8లో

సమస్యల పరిష్కారమే ధ్యేయం: ప్రభుత్వ విప్ 8లో

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి
● వాడవాడలా వర్ధంతి
● పలువురి నివాళి

తోటపల్లికి పోటెత్తిన భక్తులు 8లో

ప్రతి శనివారం ఫ్రెండ్లీ హ్యాపీ డే: కలెక్టర్

సీతానగరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యాలయాల్లో ప్రతి శనివారం 'ఫ్రెండ్లీ హ్యాపీ డే' పాటించాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి సూచించారు. శనివారం జోగింపేటలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలు, రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. బోధనపై ఆరా తీశారు. సమస్యలేమైనా ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పిం చేందుకు ప్రతి శనివారం 'ఫ్రెండ్లీ హ్యాపీ డే' నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా దీనిని అమలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సందడి చేశారు. సరదాగా స్టెప్పులు వేస్తూ.. సెల్ఫీలు దిగి.. అందర్నీ ఉత్సాహపరిచారు. ఈ పరిశీలనలో జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి, పలువురు అధికారులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కీలక దశకు ఎయిర్‌పోర్టు

● రెండు రోజులుగా చేపడుతున్న సిగ్నల్ పరీక్షలు
● టెస్టింగ్ ఫ్లయిట్ ఎగరడానికి అనుకూలంగా ఏర్పాట్లు



చురుగ్గా నిర్మాణం పూర్తి చేసుకుంటున్న భోగాపురం విమానాశ్రయం

భోగాపురం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): భోగాపురం (అల్లూరి సీతారామరాజు)అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం చివరి దశకు చేరుకోవడంతో విమాన రాకపోకల్లో కీలకంగా ఉండే సిగ్నల్స్ పరీక్షలను చురుగ్గా నిర్వహిస్తున్నారు. టెస్టింగ్ ఫ్లయిట్ ఎగరడానికి అనుకూలంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి కావాల్సి ఉండగా అంతకన్నా ముందస్తుగానే జూన్‌లోనే నిర్మాణం పూర్తి చేయాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఉంది. పనులు కూడా అంతేవేగంగా సాగుతున్నాయి. ఈ ఎయిర్‌పోర్టులో భారీ విమానాలు రాకపోకలు సాగించనున్నాయి. అందుకు సంబంధించి అన్ని పనులు ముమ్మరంగా జరుగుతుండగా దాదాపు అవన్నీ చివరి దశకు చేరుకొన్నాయి. ముందు భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి టెస్టు విమానం గగనంలోకి ఎగరనుంది. ఈ టెస్టు విమానం ఈనెల చివరి వారం లేదా వచ్చేనెల మొదటివారంలో ఆకాశంలోకి ఎగరనుంది. దీనికి సంబంధించి కీలక విభాగమైన టెక్నికల్ పరంగా సిగ్నల్స్ పరీక్షలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ముందుగా విమానం ల్యాండింగ్ అయ్యేలా పరీక్షలు చేస్తున్నారు. రాడార్ సిగ్నల్స్, ఏటీసీ, జీపీఎస్ సిగ్నల్స్, లోకలైజర్, వాతావరణ పరీక్షలు, గాలిలో విమానాల రాకపోకలకు సంబంధించిన అన్ని సిగ్నల్స్ పరీక్షలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరో మూడు నాలుగు వారాల్లో భోగాపురం ఎయిర్‌పోర్టులో విమానం ఎగరనుండడంతో ఉత్తరాంధ్ర ప్రజల కల నెరవేరుతున్నట్టే.

విన్నారా.. దండోరా?

● గ్రామాల్లో ప్రసార సాధనంగా డప్పు ● సాంకేతిక విప్లవంతో కనుమరుగు ● ప్రస్తుతం కానరాని వైనం

రాజాం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)

● 'ఇందుమూలంగా పెజలందరికీ తెలియజేయునది ఏమనగా.. రేపటి నుంచి మనూరి డీలర్ బియ్యం, కిరసనాయిలు, పంచదార, కందిపప్పు ఇస్తారంట. కాబట్టి.. రేసన్‌కార్డులు ఉన్నోలందరూ వచ్చి సరుకులు తీసుకెల్లాలని మనూరి డీలర్ చెప్పాడహో'..

● పెజలారా... రేపు మనూరికి తాసీల్దార్ గారు వస్తారట. ఎవరికైనా భూముల సమస్యలు, పాసుబుక్కులు, రేసన్‌కార్డులు, సర్టిపికెట్ల పనులుంటే ఉదయం పది గంటలకు పంచాయతీ ఆపీస్‌కు వచ్చి చెప్పుకోవచ్చని మునసబు, కరణం, పెసిడెంట్ చెప్పినారండహో'.. గతంలో పల్లెల్లో ప్రతి నెలా వినిపించే ఆ శబ్దం... ఆ మాటలు ఇప్పటికీ అనేక మందికి గుర్తే. ఇలా చాటింపు వేయడాన్నే 'దండోరా' అంటారు. మారిన పరిస్థితులు... పెరిగిన సాంకేతికతతో 'దండోరా' వినిపించడం లేదు.

● రెండు దశాబ్దాల క్రితం వరకూ..

దాదాపుగా రెండు దశాబ్దాల క్రితం వరకూ గ్రామాల్లో ప్రజలకు చేరాల్సిన సమాచారం డప్పుతో చాటింపు వేసి తెలియజేసే పరిస్థితి ఉండేది. ప్రభుత్వ, ప్రయివేటు కార్యక్రమాలకు సంబంధించి దండోరా ద్వారానే గ్రామస్తులందరికీ సమాచారాన్ని చేరవేసేవారు. గ్రామానికి అధికారులు వచ్చినా, రేషన్‌షాపునకు నిత్యావసర సరుకులు వచ్చినా, గ్రామాల్లో వారాలు, పండగలు చేయాల్సి వస్తే తేదీలు ప్రకటించాలన్నా, తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమాచారాన్నయినా, అంటువ్యాధులు ప్రబలే పరిస్థితులున్నా దండోరానే ఆధారం. ఇంటిపన్నులు, కరెంట్ బిల్లులు, భూమి శిస్తు, సాంస్కృతిక కార్యక్రమాలు చేయాల్సి వచ్చినా, నవరాత్రి ఉత్సవాలు, గణపతి మండపాలు ఏర్పాటు చేయాల్సినా దండోరా ద్వారానే ప్రజలకు తెలియజేసేవారు. ప్రజలు కూడా వీధిలో డప్పు శబ్దం వినబడగానే ఏం చెబుతారా అనే ఉత్సుకతతో ఇళ్ల ముందు నిలబడి ఆలకించేవారు. మహిళలు, చదువుకోనివారు దండోరా వేసిన వ్యక్తిని ఆపి విషయం అడిగిమరీ తెలుసుకునే పరిస్థితి కనిపించేది. మారిన పరిస్థితుల నేపథ్యంలో దండోరా కనుమరుగైంది. డప్పు చాటింపు వేసేవారు కూడా ఉపాధిని కోల్పోయారు. నేటి తరానికి దండోరా, డప్పు చాటింపు దాదాపుగా తెలియదనే చెప్పాలి.

● సాంకేతికతతో...

మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా పుణ్యమాని.. ప్రపంచంలో ఏమూలన ఏం జరిగినా క్షణాల్లో తెలుసుకునే రోజుల్లోకి చేరడంతో డప్పు చప్పుళ్లు దూరమయ్యాయి. దండోరా అనే పదమే వినిపించడం లేదని చెప్పక తప్పదు. ప్రస్తుతం మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మొబైల్ ఫోన్ శాసిస్తోంది. కులాలు, మతాలు, జాతులు, వర్గాలు, అధికారులు, అనధికారులు, స్నేహితులు, కుటుంబాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. అధికారుల పర్యటనల నుంచి నిత్యావసర సరుకుల పంపిణీ వరకు ప్రతి సమాచారం వాట్సాప్ ద్వారా క్షణాల్లో ఆయా వర్గాలకు చేరుతోంది. ఇది కూడా దండోరా వంటి పురాతన పద్ధతులు దూరమవడానికి కారణమవుతోంది.



దండోరా వేస్తున్న వ్యక్తి

ఫోన్లలోనే చూసుకుంటున్నాం..

ప్రస్తుతం ప్రతి చిన్న విషయాన్నీ ఫోన్లలోనే చూసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు తాజా సమాచారం వాట్సాప్ గ్రూపుల ద్వారా చేరుతోంది. అధికారిక సమచారం, ప్రభుత్వానికి పంపాల్సిన నివేదికలు, తుఫాన్, పంట నష్టాలు, వివిధ శాఖలకు సంబంధించిన సమాచారం అంతా వాట్సాప్‌లోనే నడుస్తోంది. అందుకే దండోరాలకు ప్రాధాన్యం తగ్గింది.

-అబ్బాస్, వీఆర్వో, రాజాం మున్సిపాలిటీ



రంగరాయపురంలోని పాఠశాల

ఈ ఊరి పాఠశాల.. ఆ ఊరిలో..!

● కొత్తవలస పేరుతో లక్కవరపుకోట మండలంలో కొనసాగింపు

కొత్తవలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాల ఒక మండలంలో ఉంది. కార్యకలాపాలన్నీ మరో మండలం పేరుతో నడుస్తుంటాయి. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళితే... 2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో జ్యోతిరావు పూలే పేరుతో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలను ఏర్పాటు చేశారు. 80 శాతం సీట్లు బీసీలు.. మిగిలిన 20 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీలతో భర్తీ చేసే ధ్యేయంతో వీటిని ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ పాఠశాల కొత్తవలస మండలానికిమంజూరైంది. నిర్వహణకు సరైన భవనాలు లేక పోవడంతో ఈ పాఠశాలను తాత్కలికంగా లక్కవరపుకోట మండలం రంగారాయపురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేశారు. కొత్తవలస మండంలో ఇప్పటికే ఏపీ మోడల్‌స్కూల్, కస్తూరిబా పాఠశాల, అంబేద్కర్ గురుకుల పాఠశాల వంటివి ఉండడంతో దీనిని కొత్తవలస పేరుతో లక్కవరపుకోట మండలంలోనే కొనసాగిస్తున్నారు. ఇటీవల ఈ పాఠశాలను అంతర్జాతీయ సాకర్ ఆటగాడు, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ బెకోహం సందర్శించారు. కొత్తవలసలోని పాఠశాలను బెకోహం సందర్శించినట్టు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలియజేస్తూ.. ట్వీట్ చేసినట్టు ప్రసార మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి. దీంతో స్థానిక అధికారులు కొంతమంది ఉలిక్కిపడ్డారు. తమకు తెలియకుండా ఏ పాఠశాలను సందర్శించారంటూ ఆరా తీయడం మొదలు పెట్టారు. చివరకు లక్కవరపుకోట మండలంలోని జ్యోతిరావుపూలే పాఠశాలను సందర్శించారని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం స్థానికులకు తెలియడంతో కొత్తవలస మండలం పేరుతో లక్కవరపుకోట మండలంలో పాఠశాల నడపడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఆ పాఠశాలను కొత్తవలసలోనే ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. వచ్చే విద్యా సంవత్సరానికైనా ఇక్కడఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

పరిశ్రమలకు త్వరగా అనుమతులు

● కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు వచ్చే దరఖాస్తులకు వీలైనంత వేగంగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. కొత్తగా ఏర్పాటు కానున్న 6 పరిశ్రమలపై సమీక్షించారు. శారదా మెటల్స్ అండ్ అల్లా యాస్ విస్తరణ, కొత్తవలస ఇన్‌ఫ్రా ఇండస్ట్రియల్ పార్కు, సాలిడ్ ఆర్గానిక్ ఆగ్రోఫామ్, సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్, సత్య బయోఫ్యూయల్, మహామాయ ఇండస్ట్రీస్ వంటివి ఏర్పాటు కానున్నాయని తెలిపారు. వీటి ప్రగతిపై సమీక్షించారు. పరిశ్రమల శాఖ డీడీ కరుణాకర్, ఏపీఐఐసీ జెడ్ఎం మురళి, పొల్యూషన్ ఇంజనీరు సరిత తదితరులు పాల్గొన్నారు.

జీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ రాక..

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ సత్యనారాయణ శనివారం రాత్రి జిల్లాకు వచ్చారు. ఆయనను జెడ్పీ అతిథి గృహంలో కలెక్టర్ రామసుందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.



ఎక్స్ అఫీషియో సెక్రటరీ సత్యనారాయణతో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

విభిన్న ప్రతిభావంతులకు ప్రోత్సాహం అవసరం

● కలెక్టర్ రామసుందర్ రెడ్డి

కొత్తవలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులలో వివిధ అంశాలలో మంచి ప్రతిభ ఉంటుందని కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి అన్నారు. మంగళపాలెం గ్రామంలోనున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టును శనివారం ఆయన సందర్శించారు. వీరిలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ఎంతో ఉన్నత స్థితికి చేరుకుంటారని చెప్పారు. గురుదేవ చారిటబుల్ ట్రస్టు ద్వారా దివ్యాంగులకు కొత్త జీవితాన్ని అందిస్తున్న ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు సేవలను కొనియాడారు. గురుదేవ సేవలు దేశవ్యాప్తంగా విస్తరించడం ప్రశంసనీయమని అన్నారు. పేద ప్రజల కోసం వైద్య సేవలు, క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేసి చికిత్సలు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన దివ్యాంగులకు అందిస్తున్న కృత్రిమ అవయవాలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల 50 వేల మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేసినట్టు ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు తెలిపారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా 30 మందికి అవయవాలు, 100మందికి నెల వారీ పింఛన్లు అందజేశారు. ట్రస్టు వైస్‌చైర్మన్ ఫణీంద్ర, జనసేన నాయకుడు గొరపల్లి రవికుమార్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

● జేసీ సేతుమాధవన్



భూమి పూజ చేస్తున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్‌నకు సంబంధించి ఇప్పటి వరకూ 78 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్టు జేసీ సేతుమాధవన్ తెలిపారు. శనివారం కేఎల్‌పురంలోని ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో సీఎంఆర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన ధాన్యానికి గాను రైతులకు రూ.140 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. మొత్తం 13,017 మంది రైతులు లబ్ధి పొందారని తెలిపారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలిస్తామని చెప్పారు.

శ్రీకేవీర్ వరలక్ష్మి రైస్ ఇండస్ట్రీపై చర్యలు..

చీపురుపల్లి మండలం జి.అగ్రహారం గ్రామానికి చెందిన యల్లంటి సూర్యారావు, బూరాడ రమణ, తుంపల్లి త్రినాథ్ అనే రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీపురుపల్లి మండలానికి చెందిన శ్రీకేవీర్ వరలక్ష్మి రైస్ ఇండస్ట్రీపై విచారణ చేపట్టామని జేసీ తెలిపారు. వారు ఎక్కువ కేజీలు డిమాండ్ చేస్తున్నట్లు విచారణలో తేలడంతో శ్రీకేవీర్ వరలక్ష్మి రైస్ ఇండస్ట్రీ రైస్ మిల్లును పోర్టల్ నుంచి డి.ట్యాగ్ చేసి.. తరువాత ధాన్యం కేటాయింపు లేకుండా చర్యలు తీసుకున్నట్టు జేసీ వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం శాంతి కుమారి, ఎఫ్‌సీఐ క్వాలిటీ మేనేజర్ రీనా తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌కోట్ స్ఫూర్తితో ఉత్తమ సేవలు అందిస్తాం

● డీసీసీబీ చైర్మన్ నాగార్జున



రాజ్‌కోట్ డీసీసీబీని సందర్శించిన చైర్మన్ల బృందం

విజయనగరం రూరల్/చీపురుపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్ డీసీసీబీ ఆదర్శమని.. ఆ స్ఫూర్తితో ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తామని డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఎర్త్ సదస్సుకి హాజరైన ఆయన శనివారం రాజ్‌కోట్ డీసీసీబీని సందర్శించారు. అక్కడ అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలను అడిగి తెలుసుకున్నారు. రాజ్‌కోట్ డీసీసీబీ ఏడాదికి రూ.18 వేల కోట్ల వ్యాపారం చేస్తోందని తెలిపారు. విజయనగరం డీసీసీబీ రూ.2,200 కోట్ల వ్యాపారం చేస్తుందన్నారు. రాజ్‌కోట్‌కు తొమ్మిది వేల కోట్లు సొంత నిధులు ఉండగా.. విజయనగరం డీసీసీబీ కేవలం రూ.370 కోట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు.



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు

● ట్రాఫిక్ సమస్యలు సృష్టించొద్దు ● ఆటో డ్రైవర్లతో ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆటోలలో ప్రయాణించే మహిళలు, మైనర్లతో ఆటో డ్రైవర్లు అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. నగరంలోని ఆటో డ్రైవర్లతో శనివారం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఎస్పీ దామోదర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి ఆటో నడుపుతూ పట్టుబడినా, రహదారి భద్రతా నియమాలు, నిబంధనలు పాటించక పోయినా ఆటోలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఆటోలను అస్తవ్యస్థంగా నిలిపి ట్రాఫిక్ సమస్యలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రహదారి భద్రత అందరి బాధ్యతని అన్నారు. ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యంగా కారణంగా రహదారి ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలను మానవతా దృక్పథంతో అర్థం చేసుకుని ఈ చలానాలు విధించడం లేదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన సంబంధ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐలు సూరినాయుడు, ఏవీ లీలారావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలకు ముప్పు

● డీఎస్పీ రాఘువులు



మాట్లాడుతున్న డీఎస్పీ రాఘువులు

చీపురుపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలతో మానవాళికి అన్ని విధాలుగా ముప్పు తప్పదని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘువులు అన్నారు. మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి పోరాదన్నారు. వీటితో ఏ రకంగా సంబంధం కలిగి ఉన్నా నేరమవుతుందని చెప్పారు. సమయాన్ని విద్య, ఉపాధి సాధనకు కేటాయించాలన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల నిరోధంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమంతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏడీఎస్ఎస్‌వీ ప్రసాద్, సీఐ జి.శంకరరావు, ఎస్ఐ ఎల్.దామోదరరావు, మానవీయత సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్ల ప్రస్థానం.. ఏదీ నాటి వైభవం?

● ఇదీ గిరిజన సహకార సంస్థ పరిస్థితి



శిథిలావస్థలో ఉన్న గొరడ జీసీసీ గోదాములు



శిథిలావస్థకు చేరిన జీసీసీ డిపో భవనం

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు మెరుగైన సేవలు అందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరిజన సహకార సంస్థ (జీసీసీ) వివిధ కారణాలతో వైభవాన్ని కోల్పోయింది. గిరిజనులు సేకరించిన అటవీ ఫలసాయానికి గిట్టుబాటు ధర కల్పించడానికి 1962లో గిరిజన సహకార సంస్థను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులకు ఈ సంస్థ ద్వారా సేవలు అందేవి. డీఆర్ డిపోలు ఏర్పాటు చేసి గిరిజనులకు బియ్యం, కిరోసిన్, ఇతర సరుకులు అందించేవారు. గిరిజనులు సేకరించే అటవీ ఫలసాయాలను దీని ద్వారా కొనుగోలు చేసేవారు. చింతపండు, తేనె, పసు పు, శీకాయ, రాజ్మా, బీన్స్, కాఫీ గింజల వంటి కొనుగోలు చేసి గిరిజన బ్రాండ్‌తో మార్కెటింగ్ చేసేవారు. వీటితో పాటు గిరిజనులు సబ్బులను తయారు చేసి అమ్మేవారు. ఇలా వ్యాపారం చేస్తూ గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ఈ సంస్థ పని చేసేది.

విభిన్న రూపాల్లో సేవలు..

గిరిజన రైతులకు పంట రుణాలు కూడా జీసీసీ ద్వారా అందించేవారు. ఆ రోజుల్లో ఈ సంస్థ కోట్లాది రూపాయల టోర్నవర్ చేసేది. సీతంపేట, పార్వతీపురం డివిజన్‌లలో ఏర్పాటు చేసిన 125కు పైగా డీఆర్ డిపోలలో అటవీ ఫలసాయాల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సంస్థలో సుమారు 150 మందికి పైగా ఉద్యోగులు ఉండేవారు. దీనిపై ఆధార పడి ఎందరో గిరిజనులు కలాసీలుగా పనిచేసేవారు. ఇంతటి చరిత్ర ఉన్న ఈ సంస్థ రోజు రోజుకూ మసకబారుతోంది. అటవీ ఫలసాయం దిగుబడి తగ్గిన కారణంగా వీటి కొనుగోలు అంతంతమాత్రంగానే ఉంది. గిరిజన రైతులకు ఖరీఫ్ రుణాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఈ సంస్థ ఉంది. ఇటీవల జీసీసీ వంట గ్యాస్ ఏజెన్సీ, పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడం ద్వారా కొంత ఆదాయాన్ని సమకూర్చుకుంటోంది.

డెప్యుటేషన్లపై..

పదవీ విరమణ చేసిన ఉద్యోగుల స్థానంలో కొత్త వారిని తీసుకోవడం లేదు. నాడు 250 మందికి పైగా ఉద్యోగులు ఉన్న ఈ సంస్థలో నేడు వంద మంది కూడా లేరు. రెగ్యులర్ సేల్స్‌మెన్ పదవీ విరమణ చేసిన తర్వాత కాంట్రాక్ట్ సేల్స్‌మెన్‌ను నియమిస్తున్నారు. ఉద్యోగుల కొరత వల్ల ఇతర శాఖల నుంచి డెప్యుటేషన్‌పై డివిజనల్ మేనేజర్లు, రీజనల్ మేనేజర్లను నియమిస్తున్నారు. ఐఏఎస్ స్థాయి అధికారి మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నా.. ఆశించిన నిధులు సంస్థకు రావడం లేదు. 15 ఏళ్లుగా ఉద్యోగుల నియామకాలు లేవు. కనీసం డైలీజ్ కోటా ఉద్యోగులను కూడా నియమించ లేని పరిస్థితిలో సంస్థ ఉంది. 50 ఏళ్ల క్రితం నిర్మించిన డీఆర్ డిపోల భవనాలు, గోడౌన్లు, బ్రాంచ్ కార్యాలయాలు, డివిజన్ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి చర్యలు లేవు. గిరిజనులకు ఎంతో మేలు చేసే ఈ సంస్థకు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పూర్వ వైభవం తీసుకురావాలి..

గిరిజన సహకార సంస్థకు పూర్వ వైభవం తీసుకురావాలి. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలి.

-విప్లవ్ కుమార్, గిరిజన నాయకుడు

ఉన్నతాధికారులకు పంపించాం..

శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్తవి నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఆమోదం పొందాల్సి ఉంది.

-ఎస్.రాము, జీసీసీ మేనేజర్, గుమ్మలక్ష్మీపురం

నేడు యోగా శిబిరం

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఉచిత బ్రెయిన్ యోగా శిబిరం నిర్వహించనున్నట్టు అమృతాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు అరిశెట్టి ఇందూమణి ఒక ప్రకటనలో తెలిపారు. గ్లోబల్ బ్రెయిన్ యోగా అకాడమీ, ఎయిమ్ రమా యోగా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ బ్రెయిన్ యోగా పురస్కార గ్రహీత యోగి శ్రీనివాసు లు హాజరుకానున్నట్టు తెలిపారు. 5 నుంచి 15 సంవత్సరాల పిల్లలను తల్లిదండ్రులతోనే అనుమతిస్తామన్నారు. వివరాలకు 79898 75999, 86363 68615 నెంబరును సంప్రదించాలని అన్నారు.

నేడు గంధ మహోత్సవం

విజయనగరం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కోట్లమాదప్ప వీధిలో ఉన్న హజరత్ సయ్యద్ దరియాఖాన్ బాబా ఆవులియా దర్గా వద్ద ఆదివారం గంధ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆ దర్గా అసోసియేషన్ ప్రకటించింది. దర్గా వద్ద భారీ అన్నదాన కార్యక్రమం జరగనుందని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రత్యేక నమాజ్‌లు, సాయంత్రం 6 గంటలకు జెండా ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని పేర్కొంది. ముస్లింలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ముస్లిం శాఖ నగర ప్రతినిధి మహ్మద్ గౌస్ కోరారు.

విమలారాణికి పరామర్శ

గుర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ చైర్మన్, ఐటీడీపీ జిల్లా అధ్యక్షురాలు కొలుకూరి విమలారాణి మాతృమూర్తి ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు శనివారం కెల్ల గ్రామం వెళ్లి విమలారాణిని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు.

11న కోఆప్షన్ సభ్యుని ఎన్నిక

మెరకముడిదాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖాళీ ఏర్పడిన కోఆప్షన్ ప్రాదేశిక సభ్యుని ఎన్నికను ఈ నెల 11న నిర్వహించనున్నట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి డీవీ మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఈ నెల 7లోగా ఫారం-2 నోటీసులను మండల పరిషత్ సభ్యులకు అందజేస్తామని అన్నారు.

స్క్రబ్ టైఫస్ జ్వరాలపై అవగాహన

కొత్తవలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తుమ్మికాపల్లి, అప్పన్నపాలెం, సీతంపేట, దేవాడ, రామలింగపురం, వీరభద్రపురం, చిన్నిపాలెం గ్రామాల్లో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో స్క్రబ్ టైఫస్ జ్వరాలపై శనివారం అవగాహన కల్పించారు. విష కీటకం కుట్టిన ప్రాంతంలో నల్లని మచ్చలాగ ఏర్పడి దద్దుర్లు, పుండులాద ఏర్పడుతుందన్నారు. జ్వరం రావడం, తలనొప్పి, కండరాలు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యాధికారి గోపాలకృష్ణ, సిబ్బంది నరిసింహారావు, జగదాంబ, సత్యారావు, పద్మావతి, కామేశ్వరి, ధనలక్ష్మి, అనూషరాణి, గీతిక పాల్గొన్నారు.

ఎన్జీవో అధ్యక్షుడిగా కొమ్మూరు

భోగాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో భోగాపురం యూనిట్ అధ్యక్షుడిగా కొమ్మూరు దుర్గారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఈ ఎన్నిక జరిగింది. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కె.సునీల, ఎన్.రవికుమార్, డి.రవికుమార్, పి.కృష్ణవేణి, కార్యదర్శిగా సీహెచ్.అప్పలనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.హేమంత్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా వై.సత్యనారాయణ, వై.స్వాతి, షేక్‌మౌలాలి, టి.సౌజన్యసాహితీ, కోశాధికారిగా కొమ్మూరు చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రైతులను ప్రోత్సహించాలి

విజయనగరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):లాభదాయక హార్టికల్చర్ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసపాణి అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం డీఆర్‌డీఏ, సెర్ప్, వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధకశాఖ, మైక్రో ఇరిగేషన్, డ్వామా, మత్స్యశాఖ, మార్కెటింగ్, నాబార్డు, ఎల్‌డీఎం, రైతు సాధికార సంస్థ, కెవీఐబీ, డీఐసీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎఫ్‌పీవోలను బలోపేతం చేయాలని, ఇన్‌పుట్, ఔట్‌పుట్ వ్యాపారాలు చేయాలని, అవసరమైన లైసెన్సులు తీసుకోవాలని, నాబార్డు ఆధ్వర్యంలో గ్రామ దుకాణ్, ఎల్‌ఈడీపీ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

విజయనగరం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు శనివారం నుంచి నిరసన బాట చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.నారాయణరావు మాట్లాడుతూ.. జీవో నెంబరు 36ని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ చేపట్టాలని, మధ్యంతర భృతి ఇవ్వాలని, చట్ట ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు.

భూములను లాక్కోవడం తగదు

శృంగవరపుకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):అభివృద్ధి పేరుతో పేదలకు చెందిన అసైన్డ్ భూములను లాక్కోవడం తగదని జిందాల్ భూనిర్వాసితులు మండిపడ్డారు. శనివారం బొడ్డవరలో జిందాల్‌కు వ్యతిరేకంగా 176వ రోజు నిరసన తెలిపారు. పరిశ్రమలు పంట పొలాల్లో కాకుండా బీడు భూముల్లో పెట్టుకోవాలని అన్నారు. అసైన్డ్ భూములను వెనక్కి తీసుకోకుండా పటిష్టమైన చట్టాలను తీసుకురావాలని కోరారు. తమ భూములను తిరిగి తమకు ఇచ్చేవరకు న్యాయ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

బడుగు, బలహీన వర్గాల

ఆశాజ్యోతి అంబేడ్కర్

రాజాం/గుర్ల/వేపాడ/విజయనగరంరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పాలకొండ రోడ్డులోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కోండ్రు పూలమాల వేసి నివాళులర్పించారు. రాజాం మునిసిపల్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కమిషనర్ రామచంద్రరావు నివాళులర్పించారు. గుర్ల మండల కార్యాలయం వద్ద బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎస్.రాఘవులు, ఎయిమ్ జిల్లా కన్వీనర్ కెల్ల బీమారావు మాట్లాడుతూ.. కుల, మత, లింగ, ప్రాంత భేదం లేకుండా రాజ్యాంగంలో ప్రజలందరికీ సమాన హక్కుల కల్పించారని అన్నారు. వేపాడ, వల్లంపూడి, సోంపురంలోని అంబేడ్కర్ విగ్రహాల వద్ద ప్రముఖ న్యాయవాది, ఏపీ దళిత కూలీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి గాలి ఈశ్వరరావు నివాళులర్పించారు. విజయనగరం జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి వీసీ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు నివాళులర్పించారు.



వేపాడ:అంబేడ్కర్ విగ్రహం వద్ద..



రాజాం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు, గుర్ల:మాట్లాడుతున్న డీఎస్పీ రాఘవులు

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం బొండపల్లి ప్రజా పరిషత్ సమావేశ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి చొరవ చూపుతున్నామని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజా శ్రేయస్సు దృష్ట్యా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నా మని తెలిపారు. కొంతమంది పనిగట్టుకొని ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగ లేదన్న విషయం ఆ పార్టీ నాయకులు గుర్తుంచుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఎం.కొత్తవలసలో అర్హత కలిగిన వృద్ధులకు పింఛన్ మంజూరు చేయాలని సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు కోరారు. చీడిపాలెంలో రామాల యం శిథిలావస్థకు చేరిందని, దాన్ని పునఃనిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ శ్రీధర్‌రాజు, ఎంపీ డీవో జి.గిరిబాల, తహసీల్దార్ డి.రాజేశ్వరరావు, సీడీపీవో ఉమాభారతి, పీఏసీఎస్ అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారా యణరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి నంబూరి రాజేష్, డోకుల శ్రీను, సర్పంచ్ ముదునూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి

ప్రజా దర్బార్‌కు స్పందన

లక్కవరపుకోట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. పలు సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. పింఛన్లు, గృహ నిర్మాణం, రోడ్లు, రేషన్ కార్డులు సమస్యలపై ఎక్కువ వినతులు వచ్చాయి. వాటిలో కొన్నింటికి పరిష్కారం అక్కడికక్కడే చూపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొరెడ్ల ఈశ్వరరావు, నాయకులు చొక్కాకుల మల్లునాయుడు, మల్లా రామకృష్ణ, మరోతి రామారావు, ఏఎంసీ డైరెక్టర్ కళ్లద్దాల శ్రీను, ఎంపీడీవో ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



వినతులు స్వీకరిస్తున్న బంగార్రాజు

భోగాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తమ దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన అన్ని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలో శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే నాగమాధవి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ముంజేరు సమీపంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

డెంకాడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని భోగాపురం సీడీపీవో వై.లావణ్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం బాల్య వివాహాలు చట్ట విరుద్ధమనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీవో మాట్లాడుతూ.. మహిళలకు 18 సంవత్సరాలలోపు, పురుషులకు 21 సంవత్సరాలలోపు వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాలికను వివాహం చేసుకుని సంసారం చేస్తే వరుడితో పాటు వారి తల్లిదండ్రులకు పోక్సో చట్టప్రకారం శిక్ష తప్పదన్నారు. బాల్య వివాహాలను రూపుమాపేందుకు ప్రతీ అధికారి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.భవాని, తహసీల్దార్ ఎన్.రాజారావు, ఎస్ఐ ఆరంగి సన్యాసినాయుడు, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, రామకోటి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిని, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుర్లలో..

గుర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిర్మూలించాలని ఎంపీపీ పొట్నూరు ప్రమీల అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఆదిలక్ష్మి, గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర, ఇన్‌చార్జి ఎంపీడీవో వరప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఎస్.కోట ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ప్రసన్న అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను ప్రతిఒక్కరికీ తెలియాలన్నారు. బాల్య వివాహాలపై అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సూర్యనారాయణమూర్తి, పీహెచ్‌సీ వైద్యులు శిరీష, ధనుంజయ్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోటలో..

శృంగవరపుకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధానికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ప్రతిజ్ఞ చేశారు. శనివారం సీడీపీవో పి.అచ్చుతాంబ అధ్యక్షతన మండల స్థాయి బాల్య వివాహాల నిరోధక కమిటీ సమావేశమైంది. బాల్య వివాహాలతో జరిగే నష్టాలను వివరించారు. డ్రాప్ అవుట్ బాలికలను తిరిగి పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

సకాలంలో విధులకు హాజరుకావాలి

వేపాడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. బల్లంకి, బానాది గ్రామ సచివాలయాలను శనివారం ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణతో కలిసి ఆయన పరిశీలించారు. సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. ఎవరైనా విధులకు ఆలస్యంగా వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించడంలో కీలపాత్ర పోషించాలని సూచించారు. అనంతరం చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీకంపోస్టు తయారు చేయాలని అన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



పదో తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్లు అందజేసిన దృశ్యం

నెల్లిమర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో సూర్యనారాయణమూర్తి అన్నారు. కొండగుంపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం మోడల్ పేపర్ల అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్ సొంత నిధులతో వీటిని సమకూర్చారు. ఆయన కుమార్తె, ఎంబీబీఎస్ విద్యార్థి పతివాడ సమీర చేతుల మీదుగా వీటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పతివాడ శంకరరావు, ఇన్‌చార్జి హెచ్ఎం సత్యప్రకాష్, ఆర్.నాగేశ్వరరావు, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు మద్దిల సత్యనారాయణ, ఉండ్రు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలు లక్ష్యం కావాలి

రేగిడి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గ్రామాలు లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని ఎంపీడీవో శ్యామాలకుమారి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో స్వచ్ఛఆంధ్ర, గ్రామీణనీటి సరఫరా, పారిశుధ్యంపై శనివారం సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఒకవైపు పరిశుభ్రత, మరోవైపు సేంద్రియ ఎరువుల తయారీ, నీటివనరులపై దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జేఈ శ్రీచరణ్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సీహెచ్ పద్మ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను కొనుగోలు చేస్తే చర్యలు

శృంగవరపుకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) అసైన్డ్ భూములను విక్రయించిన, కొనుగోలు చేసినా పీవోటీ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డి.శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక పుణ్యగిరి రోడ్డు సమీపంలో చదును చేసిన అసైన్డ్ భూమిని శనివారం ఆయన పరిశీలించారు. వారం రోజుల కిందట ఈ భూమిని కొందరు వ్యక్తులు చదును చేశారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులను ఆపారు. ఇదే విషయాన్ని ఓ ప్రజా ప్రతినిధి తహసీల్దార్‌ను నిలదీయడంతో క్షేత్ర స్థాయిలో చూసేందుకు వెళ్లారు. ఆయన వెంట సర్వేయర్ రమ ఉన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

రాజాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీశాఖ మంత్రి లోకేశ్ లక్ష్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. స్థానిక జీఎంఆర్‌ఐటీలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ నాలుగు నెలలకు ఒకసారి మెగా జాబ్ మేళాను నిర్వహించి పెద్దఎత్తున గ్రామీణ యువతి, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. శనివారం జరిగిన జాబ్‌మేళాకు 1568 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 663 మంది 35 బహుళజాతి కంపెనీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యఅధికారి కె.ప్రశాంత్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ భాస్కర్, ఎంప్లాయిమెంట్ అధికారి వహీద, ప్రినిపాళ్ల ప్రసాద్, బండారు భాస్కరరావు, నాయకులు పాల్గొన్నారు,

సేవల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

సంతకవిటి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) ; సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు కఠినంగా ఉంటాయని మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ శారదాదేవి సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. శనివారం మండల అభివృద్ధి అధికారి కె.సురేష్‌కుమార్‌తో కలసి చిత్తారపురం, గోళ్లవలస, తమరాం, కాకరాపల్లి సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సచివాలయాల్లో ఇప్పటి వరకు అందించిన సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బంది ఎంత సమయానికి వస్తున్నారో, వెళ్తున్నారో అన్నది ఆన్‌లైన్ హాజరును పరిశీలించారు. సచివాలయాలకు వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో హరనాథ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విమానాశ్రయ నిర్మాణ కార్మికుడి మృతి

భోగాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రెడ్డికంచేరు సమీపంలో విమానాశ్రయ నిర్మాణ పనుల్లో పాల్గొంటున్న కార్మికుడు డిబార్ నాయక్(46) శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ కె.దుర్గాప్రసాదరావు తెలిపారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన నాయక్ రెడ్డికంచేరు సమీపంలో నివాసముంటూ ఎల్అండ్‌టీ ఆధీనంలో విమానశ్రయ పనులు చేస్తున్నాడు. శనివారం రాత్రి ఫోన్ మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు ఆయన్ను చికిత్స నిమిత్తం తగరపువలసలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

లక్కవరపుకోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన రంగరాయపురం గ్రామానికి చెందిన పూతిన సీతారాం(55) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడని ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు. సీతారాం ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం డ్యూటీ ముగించుకొని తన అన్న సోంబాబుతో కలిసి వస్తుండగా గ్రామ సమీపంలోని టీపాయింట్ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో సీతారాంకు తీవ్రగాయాలు కాగా, సోంబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. సీతారాంను కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనపై కేసు..

మండలంలోని మల్లివీడు గ్రామానికి చెందిన దమ్ము గౌరినాయుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు. గ్రామానికి చెందిన కసిరెడ్డి చిన్నకోటి, కసిరెడ్డి సన్యాసిరావు, పెదిరెడ్ల గోపి కలిసి మాట్లాడుకుంటుండగా, డబ్బుల విషయమై గౌరినాయుడు.. చిన్నకోటి, గోపిపై కర్రతో దాడిచేసి గాయపరిచాడు. బాధితుల ఫిర్యాదు మేరకు గౌరినాయుడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి సస్పెన్షన్

విజయనగరం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 49వ సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి పక్కి శివప్రసాద్‌ను సస్పెండ్ చేసినట్లు కమిషనర్ నల్లనయ్య తెలిపారు. శనివారం ఈ సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. వెల్ఫేర్ కార్యదర్శి శివప్రసాద్ తరచూ విధులకు గైర్హాజరవుతుండడంతో ఆయన్ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని, ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని అన్నారు.

●నగరంలోని కంటోన్మెంట్ పాఠశాలను అనుకుని ఉన్న కార్పొరేషన్ పార్కులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న సీతారామును సస్పెండ్ చేసినట్లు కమిషనర్ నల్లనయ్య తెలిపారు. విధులపై సీతారాము నిర్లక్ష్యంగా ఉండడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

డిజిటల్ అసిస్టెంట్‌కు మెమో జారీ

రాజాం డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): గారాజుచీపురుపల్లి గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు మెమో జారీ చేసినట్లు డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఈ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించగా గత నెల 24వ తేదీ నుంచి డిజిటల్ అసిస్టెంట్ విధులకు హాజరు కాకపోవడాన్ని ఆయన గుర్తించారు. సెలవుపై అధికారులకు ఎలాంటి సమాచారం లేనందున ఆయనకు మెమో జారీ చేసినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి తగిన సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట

బొండపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నట్లు బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను శనివారం ఆమె సందర్శించారు. అనంతరం ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ.. ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుబడిన గంజాయిని ప్రత్యేకంగా పరిశీలిస్తామన్నారు. పట్టుబడిన సరుకులో కోర్టులో ఎంత హాజరుపరిచారు, ఇంకా ఇంత హాజరుపరచాల్సింది ఉంది, ఎన్ని కేసులు ఉన్నాయి, ఎన్నింటికి ల్యాబ్‌పరీక్షలు చేశారో పరిశీలించి నివేదికలను ఎస్పీకి అందజేయనున్నట్టు చెప్పారు. జాతీయ రహదారులపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, నివారణకు ప్రత్యేకంగా స్టాపర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఈ.కోటిరెడ్డి, గజపతినగరం సీఐ జీఏవీ రమణ, బొండపల్లి, గజపతినగరం ఎస్ఐలు యు.మహేష్, కిరణ్‌కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

భోగాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముంజేరు పంచాయతీ సిద్ధార్థ కాలనీ దళితులపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా శనివారం రిలే నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మురికి కాలువ పనులను అడ్డుకున్న దళిత మహిళలపై ఓసీలు కులాలకు చెందిన వ్యక్తులు మూకుమ్మడిగా దాడి చేయడం దారుణమన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో రిలే నిరాహార దీక్షలకు దిగినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్, రమణమ్మ, సీఐ దుర్గాప్రసాదరావుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ రైట్స్ వ్యవస్థాపకుడు పి.వెంకటరమణ, వీర్రాజ్, దుర్గారావు, బాలకృష్ణ, గంటాన అప్పారావు, వెంకటరావు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీపై సభ్యుల ధ్వజం

వంగర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వ్యవసాయ అధికారులు ఇటీవల ఇష్టారాజ్యంగా ఎరువులు పంపిణీ చేశారంటూ సభ్యులు ధ్వజమెత్తారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సురేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వ్యవసాయశాఖపై జరిగిన సమీక్షలో వీవీఆర్‌పేట సర్పంచ్ గురువులు మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో ఎరువుల పంపిణీ సక్రమంగా జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీపై జరిగిన చర్చలో పలువురు సభ్యులు ఏపీవోని నిలదీశారు. గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఎందుకు పనులు కల్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. రెవెన్యూ, అంగన్‌వాడీ, విద్యాశాఖపై నామమాత్రంగా చర్చించి మమా అనిపించారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న సభ్యులు

సమస్యల పరిష్కారమే ధ్యేయం: విప్


వినతిపత్రం అందజేస్తున్న అర్జీదారులు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటికి తక్షణ పరిష్కారం చూపడమే ప్రజా దర్బార్ ముఖ్య ధ్యేయమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు.శనివారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. అలాగే గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జియమ్మవలస మండలస్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం పార్టీ మండలాధ్యక్షుడు జోగి భుజంగరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి ఇంటికి చేరవేయడం పార్టీ బాధ్యత అని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వంద శాతం కూటమి అభ్యర్థులనే గెలిపించే విధంగా కృషి చేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోలులో దోపిడీని అరికట్టాలి

సీతానగరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో దళారుల దోపిడీని అరికట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు కోరారు. శనివారం సీతానగరంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులు పండించే వరి పంటకు ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధర రూ. 2,369లు ప్రకటించినా రైతుల నుంచి 105 కేజీల ధాన్యం తీసుకోవడమే కాకుండా రూ. 2,069లు చెల్లిస్తున్నారన్నారు. క్వింటాకు రూ. 300లు రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం అట్టాహాసంగా గ్రామసభలు పెట్టి రైతన్నా-మీకోసం కార్యక్రమంలోప్రచారంచేసి మద్దతు ధర ప్రకటించినా ప్రకటనలకే పరిమితమయ్యిందని ఆరోపించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

పాలకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు పేర్కొన్నారు. శనివారం వడమ, ఇందిరానగర్ కాలనీల్లో కళాశాలల ఎన్ఎస్ఎస్-1,2యూనిట్ల ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజు, కౌన్సిలర్ ప్రతినిధులు పి.బాబ్జీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.జయమణి, బి.రాజు పాల్గొన్నారు.

●గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం తెలిపారు. శనివారం ఎస్‌కేపాడులో గుమ్మలక్ష్మీపురం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేశానేజ కార్యక్రమంలో 104 సిబ్బంది అనూష, సీహెచ్‌వో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

గరుగుబిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు హెచ్చరించారు. శనివారం గరుగుబిల్లిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పర్యవేక్షించి కాల్వల్లోని వ్యర్థాలను తొలగించాలని కోరారు.

పీటీఎంతో ఉపయోగం లేదు

బెలగాం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ (పీటీఎం) కార్యక్రమం పబ్లిక్ స్టంట్అని, దీంతో తల్లితండ్రులు, ఉపాధ్యాయులకు ఉపయోగంలేదని మాజీ డిప్యూటీ సీఎంలు పాముల పుష్పశ్రీవాణి, పీడిక రాజన్నదొర విమర్శించారు. శనివారం పార్వతీపురంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు సీఎం వరాలు జల్లు కురిపిస్తార చూసిన ప్రజల ఆశలపై నీళ్లు చల్లారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వి.కళావతి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

జియ్యమ్మవలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రగతి స్థాయిలను బట్టి రైజింగ్, షైనింగ్ స్టార్స్‌గా విభజించి ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా పనిచేస్తామని హెచ్ఎం అల్లు ప్రసాదరావు తెలిపారు. శనివారం వనజ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల పదో తరగతి 2025-26 బ్యాచ్‌కు వంద రోజుల కార్యాచరణ పథకాన్ని ప్రారంభించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

కొమరాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వియ్యంపేట రెసిడెన్షియల్ కళాశాల ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న దుగ్గి గ్రామానికి చెందిన కారు శరణ్య జాతీయస్థాయి టెన్నీస్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యిందని పీడీ ఉమ తెలిపారు. ఢిల్లీలో ఈనెల 26న జరుగుతాయని పేర్కొన్నారు. ఈ మేరకు శరణ్య ఎంపికపై గ్రామస్థులు, తల్లిదండ్రులు నాగరాజు, నాగమణి హర్షం వ్యక్తంచేశారు.

సేవాభావాన్ని అలవరచుకోవాలి

జియ్యమ్మవలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతో పాటు సేవాభావాన్ని కఅలవరచుకోవాలని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సవరపు రవణ పిలుపునిచ్చారు. శనివారం తాళ్లడుమ్మ పంచాయతీ చంద్రశేఖరరాజపురంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం అధికారి సంజయ్‌కుమార్ చావడా, లెక్చరర్లు రాధాకృష్ణ, వీకేజీ మహారాణా, పతివాడ శ్రీను, గౌరీశంకర్ పాల్గొన్నారు.

విధిగా పౌష్టికాహారం తీసుకోవాలి

గరుగుబిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు. శనివారం గరుగుబిల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం-2ను పరిశీలించారు. ఈసందర్భంగా కేంద్రంలో వండిన వంటలను పరిశీలించారు. రికార్డులను తనిఖీచేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సాలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపల్లి జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీవో పార్వతి, తహసీల్దార్ నీలకంఠరావు పరిశీలించారు. గతంలో పాఠశాల మధ్యాహ్న భోజన పథకంపై ఫిర్యాదు రావడంతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని తల్లి తన పిల్లలకు వండి పెట్టేట్టుగా నిర్వహించాలని సూచించారు.

మూలకు చేరినా.. పట్టించుకోరా?

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. అయితే గత పది రోజులుగా అది పనిచేయడం లేదు. మరమ్మతులకు గురికావడంతో షెడ్‌కు చేరింది. దీనిపై కూడా అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ● స్వచ్ఛ సుందర కార్యక్రమ నిర్వహణకు ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని అధికారులు బడ్జెట్‌లో చూపిస్తున్నారు. కానీ మరమ్మతులకు గురైన మునిసిపాలిటీ వాహన విషయంలో ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. రెండు నెలలుగా ఒక కంపాక్టర్ పార్వతీపురం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పడి ఉంది. మరొక దానిని మరమ్మ తుల కోసం విజయనగరం పంపించారు. మొక్కలకు నీటిని అందించే ట్రాక్టర్ మరమ్మతుల కోసం ఇంజనీరింగ్ అధికారులు అపసోపాలు పడుతున్నారు. ● ఇప్పటికే పార్వతీపురంలోని పలువార్డుల్లో పారిశుధ్యంక్షీణించింది. ఎక్కడికక్కడే చెత్తాచెదారం పేరుకుపోతున్నాయి. చెత్తలను తరలించే కంపాక్టర్‌లను తక్షణమే బాగు చేసి వినియోగంలోకి తేవాలని పట్టణ వాసులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ● దీనిపై మున్సిపల్ కమిషనర్ కె.కిషోర్‌కుమార్‌ను వివరణ కోరగా..' కంపాక్టర్లతో పాటు ట్రాక్టర్‌కు త్వరితగతిన మరమ్మతులు చేపడతాం. త్వరలోనే వాటిని అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించాం.' అని తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రతిఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటాలు, విగ్రహాలకు వివిధ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● పార్వతీపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్ మనమధ్య లేకపోయినా మనందరి హృదయాల్లో ఉన్నారని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. పట్టణంలోని ఇందిరాకాలనీ కూడలి వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే ప్రధాన రహదారిలో గల అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా రెల్లికుల సేవా సంఘ నాయకులు జి.డేనియల్, పి.రాజశేఖర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఏఎంసీ చైర్మన్ గౌరీశ్వరీ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

●పాలకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని రెల్లివీధిలో అంబేడ్కర్ వర్ధంతిని రాష్ట్ర రెల్లికుల ఉపాధ్యక్షుడు మజ్జి బాబ్జీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అప్పన్న, సోమేష, ఇసై నాగ, నవీన్, కార్తీక్, రాజు,లాజర్, మహేష్, సత్యం పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ ఈయూ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో ఈయూ జోనల్ సెక్రటరీ బీకే మూర్తి, నేతలు రాజు, సాగర్, రమణ, స్వరాజ్యం, దొర, జానకి, లక్ష్మీ, రాజారావు, రాములమ్మ పాల్గొన్నారు.

●సాలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):ప్రపంచం గర్వించదగ్గ మేధావి అంబేడ్కర్ కౌన్సిలర్ ఈశ్వరరావు తెలిపారు. సాలూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

●వీరఘట్టం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి కేవీపీఎస్ మండల కార్యదర్శి సింహాచలం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వి.ఇందిర, దూసి శ్రీనివాసరావు, ఎన్.వసంత పాల్గొన్నారు.

●భామిని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భామిని, ఘనసర, తాలాడ, బాలేరు తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి యువకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●గరుగుబిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి శాఖా గ్రంథాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు ఆధ్వర్యంలో ర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పార్వతీపురం: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సమస్యలన్నీ పరిష్కరిస్తాం

● పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

పాలకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు.శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జనవాహిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజలు పలు సమస్యలపై వినతిప త్రాలు అందించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కాగా దుగ్గి గ్రామానికి చెందిన వైసీపీ నుంచి 50 కుటుంబాలు, ఇద్దరు వార్డు సభ్యులు జయకృష్ణ ఆధ్వర్యంలో జనసేనలోనికి చేరారు. అలాగే మండలంలోని వెలగవాడ గ్రామానికి చెందిన గొడే సింహాచలానికి రూ.1,69,647 సీఎం సహాయనిధిని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అందించారు.

● వీరఘట్టం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నడుకూరుకు చెందిన మత్స పోలినాయుడుకు వీరఘట్టంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం రూ.25 వేలు సీఎం ఆర్ఎఫ్‌చెక్కు ఎమ్మెల్యే నిమ్మకజయకృష్ణ అందించారు.కార్యక్రమంలో ఉదయ్‌భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, చింత ఉమా, వెలగవడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వీరఘట్టం: సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న జయకృష్ణ

తోటపల్లికి పోటెత్తిన భక్తులు

గరుగుబిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాలకు శనివారం భక్తులు పోటెత్తారు. శనివా రం కావడంతో పరిసర ప్రాంతాల భక్తులు తరలి రావడంతో దేవస్థానం ప్రాంగణం కిటకిటలాడిం ది. తొలుత ఉభయ దేవస్థానాల్లో పూజలు నిర్వ హించిన తదుపరి భక్తులకు సర్వదర్శనం కల్పిం చారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా దేవస్థానం కమిటీ ఛైర్మన్ మార్కొండ పకీరునా యుడు, ఈవో బి.శ్రీనివాస్, సిబ్బంది అవస రమైన చర్యలు చేపట్టారు. కాగా తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారిస్తానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ తెలిపారు. శనివారం స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.నూతనంగా నియామకమైన ఛైర్మన్ మార్కొండ పకీరునాయుడుతో పాటు సభ్యులను అభినందించారు.


వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సీతానగరంలో అభ్యుదయ సైకిల్ యాత్ర

సీతానగరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీతానగరం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలోఅభ్యుదయ సైకిల్ యాత్ర శనివారం ఎస్ఐ ఎం.రాజేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పిఠాపురం నుంచి ఇచ్ఛాపురం వరకు అభ్యుదయ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ, ఎంపీడీవో, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో అరవింద్‌కుమార్, బి.శ్రీనివాసరావ పాల్గొన్నారు.


సీతానగరం: అభ్యుదయ సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న ఎస్ఐ రాజేష్

సారా నిర్మూలనే ధ్యేయం

జియ్యమ్మవలస, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనే ధేయమని ఎక్సైజ్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. చినమేరంగిలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సచివాలయం ఉద్యోగిని మృతికి సంతాపం

కురుపాం రూరల్ డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కురుపాం మండలంలోని పెద్దగొత్తిలిగ్రామసచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న గుమ్మలక్ష్మీపురం మండలంలోని సీమలగూడకు చెందినఎప్పరిక తేజశ్వరి (26) అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. ఈ మేరకు కురుపాం ఎంపీడీవో ఉమామహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి బి.చంటి, సర్పంచ్ టి.లోకనాధం సీమలగూడ వెళ్లి సంతాపం తెలియజేశారు.

కురుపాంలో 'ముస్తాబు'


చేతులు శుభ్రపరిచే విధానాన్ని వివరిస్తున్న ఎంపీడీవో

కురుపాం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): కురుపాం గిరిజనసంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ముస్తాబు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి విద్యార్థులకు చేతులు శుభ్రపరిచే విధానాన్ని వివరించారు.

నిక్కచ్చిగా విధులు నిర్వహించండి: ఎంపీడీవో

పార్వతీపురం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకంలోని సామాజిక తనిఖీ కార్యకర్తలు మోహమాటాలు లేకుండా నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో సత్యం కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ కార్యకర్తలపై ఎంతో బాధ్యత ఉందని తెలిపారు. కార్య క్రమంలో సామాజిక తనిఖీ రాష్ట్ర టీం అధికారి వై.గౌరిశంకర్, ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు, డిప్యూటీ ఎంపీడీవో పాపారావు, 15 మండలాల సామాజిక తనిఖీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరు నిర్మాణానికి చర్యలు

బోరుబావి నిర్మాణానికి నిధులు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో సత్యం హామీఇచ్చారు. శనివారం నర్సిపురం ఎస్సీకాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటరమణ తదితరులు వినతిపత్రం అందజేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

రామభద్రపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కల్పించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి హెచ్చరించారు. శనివారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, పిల్లలను వేధించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. యువత గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే గంజాయి నిరోధానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం స్టేషన్‌లో ఉన్న గంజాయి నిల్వల పరిమాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ కోటిరెడ్డి, బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు, ఎస్ఐ వెలమల ప్రసాదరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిల్లర్లు నిబంధనలు పాటించాలి

బొబ్బిలి రూరల్ , డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలని తహసీల్దార్ ఎం.శ్రీను కోరారు. శనివారం మండలంలోని పిరిడి గ్రామంలో గల రామాంజనేయ రైసు మిల్లును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతుల సమస్యలు మిల్లర్లతో చర్చించారు. రైతల వద్ద నుంచి అదనపు ధాన్యాన్ని డిమాండ్ చేయవద్దని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్యాంకు గ్యారెంటీలు ఎప్పటికప్పుడు ఇస్తుండాలని, రైతులకు బిల్లులు వెంటనే చెల్లించాలంటే బ్యాంకు గ్యారంటీలు తప్పనిసరి అని తెలిపారు. మిల్లుకు వచ్చిన లోడ్లు వెంటనే దింపి పంపించాలని సూచించారు. మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలను ఆలస్యంగా ఇవ్వడంతో సమస్య నెలకొందని ప్రస్తుతానికి పరిష్కారం అయిందని ఆయన తెలిపారు. గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతులు ప్రైవేటు మార్కెట్‌లో కొనుగోలు చేస్తే ప్రభుత్వం గన్నీ బ్యాగుకు నాలుగన్నర రూపాయలు చెల్లిస్తుందని చెప్పారు.

సాగుచేసిన భూములకు పట్టాలివ్వాలి

రామభద్రపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న పేదలకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొట్టక్కిలో విలేకరులతో మాట్లాడుతూ కొట్టక్కి రెవెన్యూ పరిధిలోని 537 సర్వే నెంబరులో సాగుచేస్తున్నభూములకు పట్టాలు ఇవ్వకుండా అధికారులు తాత్సారంచేస్తున్నారని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ పార్కు పేరుతో డీపట్టా భూములను కంపెనీలకు ధారాదత్తం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

కురుపాంలో నిధుల దుర్వినియోగంపై విచారణ


విచారణ నిర్వహిస్తున్న సత్యనారాయణ

కురుపాం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో మండల పరిషత్ నిధులు దుర్వినియోగంపై ఆదివాసీ అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జడ్పీ సీఈవో సత్యనారాయణ శనివారం ఎంపీడీవో కార్యాయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పనులు చేయకుండా నిధులు డ్రాచేశారని, ఈ విషయంపై స్పష్టమైన ఆధారాలు చూపినా తూతూమంత్రంగా విచారణ చేసి వెళ్లిపోయారని ఆరోపించారు. నిధులు దుర్వినియోగంపై పూర్తి స్థాయిలో విచారణ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

సాలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సారిక నుంచి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం తన సిబ్బందితో దాడిచేసి స్వాధీనంచేసుకున్నారు. 1940 కేజీల బియ్యాన్ని సీజ్‌చేసి ఆటోను కూడా సాలూరు రూరల్ పోలీసులకు అప్పగించారు. అనంతరం సీఐ విలేకరులతో మాట్లాడుతూ సారిక నుంచి అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పట్టుకున్నట్టు తెలిపారు. దిప్పల సురేష్‌కు చెందిన ఆటోను సీజ్‌చేసి 6ఏ కేసు నమోదుచేసినట్లు చెప్పారు. ఆయన తోపాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్‌మౌలాలీ కూడా ఉన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌కు ఆర్థికసాయం

పాలకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న దుర్గ నాలుగునెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఈయూ నాయకులు బీకేమూర్తి ఆధ్వర్యంలో శనివారం పరామర్శించారు. ఈమేరకు దుర్గకు రూ.50 వేలు ఆర్థికసాయం అందించారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతంచేయాలి

పాలకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ ఏడాది 31 నుంచిజరిగే సీఐటీయూ 18వ జాతీయ మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు.ఈ మేరకు పాలకొండలో మహాసభల గోడపత్రికలను శనివారం ఆవిష్కరించారు. కార్య క్రమంలో సంజీవి, భాస్కరరావు, ఆంజనేయులు, విశ్వేశ్వరరావు, మధు, ప్రశాంతి, రామారావు, గిరి పాల్గొన్నారు.

గాడిలో పడేనా?

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో 15 మండలాలకు 15 మంది పర్యవేక్షణ అధికారులను నియమించారు. ● మండలాల వారీగా చూస్తే.. పార్వతీపురానికి రోబెన్, సాలూరు మునిసిపాలిటీకి పి.ప్రసాద్ నియామకమయ్యారు. గుమ్మలక్ష్మీపురానికి ఎం.వాసుదేవరావు, సీతంపేటకు కె.మోహన్‌బాబు, కురుపాంకు ఎస్.శ్రీనివాసరావు, మక్కువకు ఎం.ఫణిభూషణ్, పాలకొండకు ఎస్.అడవిరాముడు, సీతానగరంకు ఎం.శివప్రసాద్ నియామకయ్యారు. కొమరాడకు ఆర్.ప్రభాకర్, సాలూరుకు కె.వి.సాయిరాం, బలిజిపేటకు పి.వెంక టరావు, పాచిపెంటకు సి.హెచ్.వాసు ప్రకాశరావు, వీరఘట్టానికి ఎస్.శాంతారావు, జియ్యమ్మవలసకు పి.శ్రీనివాసరాజు, భామినికి ఎం.శ్రీనివాసరావు, గరుగుబిల్లికి బి.హరినారాయణ పార్వతీపురానికి ఎం.వెంకటేశ్వర శర్మ నియామకమయ్యారు. ఇందులో గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, పాచిపెంట, సీతంపేట, వీరఘట్టం మండలాల్లో సచివాలయాలకు నియా మకమైన ప్రత్యేక పర్యవేక్షణ అధికారులు ఇంకా విధుల్లో చేరలేదు. మిగిలిన మండలాల్లో నియామకమైన అధికారులు ఈ నెల 5న విధుల్లో చేరారు. అయితే ఇప్పటికైనా జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల పనితీరు మారుతుందని , సకాలంలో సేవలందుతాయని జిల్లావాసులు ఆశిస్తున్నారు.

'ఉత్తి'పోతల పథకాలేనా?

(5వ పేజీ తరువాయి)

లోచర్ల, బొబ్బిలి మండలం రాముడువలస గ్రామాలకు ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసినట్టు ప్రకటించారు. కానీ అందుకు సంబంధించిన పరిపాలనాపరమైన అనుమతి గాని, నిధుల జాడ గాని లేకపోయింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తుత బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే బేబీనాయన సీఎం చంద్రబాబును కలిసి మరోసారి ఈ రెండు ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరుచేయాలని అభ్యర్థించారు. సాగునీటి రంగానికి, రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేస్తామని చెప్పే చంద్రబాబు ఈ రెండు ఎత్తిపోతల పథకాలకు అవసరమైన పూర్తిస్థాయి నిధులను మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

నత్తనడకగా కాలువ లైనింగ్ పనులు

తోటపల్లి కాలువకు లైనింగ్ పనులు చేస్తే గండ్లు సమస్య నివారించడమే కాక నీటి వృథాను అరికట్టి అదనపు ఆయకట్టుభూములకు సాగునీరందించేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకోసం రూ.55 కోట్లు మంజూరు చేశారు. 48.8 కిలోమీటర్ల పరిధిలో లైనింగ్ పనులకు గాను 22 శాతం పనులు మాత్రమే జరిగాయి. ఈ పనులకు సంబంధించి ఇంకా రూ.3.2 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని తోటపల్లి డీఈఈ కుమార్ తెలిపారు. కాలువల్లో నీటిని పంటకాలం అయిన తరువాత తొలగించి మిగతా పనులు చేపడతామని ఆయన తెలిపారు.

